TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 143 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ బుధవారం.17.12.2025 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD


## అభివృద్ధికి సహకరించండి

న్యూఢిల్లీ :అమృత్ తెలంగాణ: తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న యంగ్ ఇండియా స్కూల్స్‌కు ఆర్థిక వెసులుబాటుతోపాటు హైదరాబాద్‌కు ఐఐఎం మంజూరు చేయాలని కోరారు. ఈ మేరకు మంగళవారం పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌లను ఆయన వేర్వేరుగా కలిసి వినతి పత్రాలు సమర్పించారు. ఈ భేటీలో ఢిల్లీలో ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేంద్ర రెడ్డితో పాటు ఎంపీలు పాల్గొన్నారు. తొలుత ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను వారు ఆమె ఛాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో విద్యారంగంపై ప్రభుత్వం పెడుతోన్న ఫోకస్ గురించి వివరించారు. ఇందులో భాగంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల (వైఐఐఆర్ఎస్)ను నిర్మిస్తున్నట్టు చెప్పారు. విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేసే ఈ ప్రాజెక్ట్, ఇతర విద్యాభివృద్ధి రుణాలకు ఎఫ్ఆర్‌బీఎం నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. అనంతరం కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసి హైదరాబాద్‌లో ఐఐఎం, కేంద్రీయ, నవోదయ విద్యాలయాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

విద్యా రంగంపై శ్రద్ధకు ఆర్థిక మంత్రి ప్రశంసలు

తెలంగాణ విద్యారంగం అభివృద్ధికి తాము తీసుకుంటున్న చర్యలకు మద్దతుగా నిలవాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో అత్యధిక సంఖ్యలో ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందిం చేందుకు రాష్ట్రప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. తెలంగాణ వ్యాప్తంగా 105 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిర్మిస్తోన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల (వైఐఐఆర్ఎస్) ప్రాధాన్యతను తెలియజేశారు. 5 నుంచి 12 తరగతుల వరకు ఉండే ఒక్కో వైఐఐఆర్ఎస్‌లో 2,560 మంది విద్యార్థులు ఉంటారని, మొత్తంగా 105 పాఠశాలల్లో 2.70 లక్షల మంది విద్యార్థులకు ప్రత్యక్షంగా నాణ్యమైన విద్యాబోధన లభిస్తుందని సీఎం వివరించారు. వైఐఐఆర్ఎస్‌లు సమీప ప్రభుత్వ పాఠశాలలకు విద్యా హబ్‌లుగా ఉండడంతో పరోక్షంగా లక్షలాది మంది విద్యార్థు లకు ప్రయోజనం కలుగుతుందన్నారు.

అత్యాధునిక వసతులు, లేబొరేటరీలు, స్టేడియాలతో నిర్మించే ఈ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి రూ.21 వేల కోట్ల వ్యయమవుతుందని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రికి చెప్పారు. అలాగే, రాష్ట్రంలోని జూనియర్, డిగ్రీ, సాంకేతిక కళాశాలలు, ఇతర ఉన్నత విద్యా సంస్థల్లో ఆధునిక ల్యాబ్‌లు, ఇతర మౌలిక వసతుల కల్పనకు మరో రూ.9 వేల కోట్లు వెచ్చించనున్నట్టు వివరించారు. మొత్తంగా రాష్ట్రంలో విద్యా రంగం సమగ్రాభివృద్ధికి తమ ప్రభుత్వం రూ.30 వేల కోట్లు కేటాయిస్తున్నట్టు తెలిపారు. ఈ నిధుల సమీకరణకు తాము ప్రత్యేక ప్రయోజన సంస్థ (ఎస్ పీసీ)ను ఏర్పాటు చేయనున్నామని, దాని ద్వారా సేకరించే రుణా లకు ఎఫ్ఆర్‌బీఎం పరిమితి నుంచి మినహా యించాలని విజ్ఞప్తి చేశారు. విద్యా రంగంపై తమ ప్రభుత్వం చేస్తున్న వ్యయాన్ని మానవ వనరుల అభివృద్ధికి చేస్తున్న పెట్టుబడిగా భావించాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. ఈ సందర్భంగా వైఐఐఆర్ఎస్ రూపంలో తెలంగాణలో విద్యా రంగం అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి చూపుతున్న చొరవపై కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రశంసించారు. వైఐఐఆర్ఎస్ మోడల్ బాగుం దని, ఎస్‌పీసీకి సంబంధించిన వివరాలను అందజేయాలని సూచించారు.



హైదరాబాద్‌కు ఐఐఎం మంజూరు చేయండి

హైదరాబాద్‌లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)ను మంజూరు చేయాలని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. టెక్నాలజీ, లైఫ్ సైన్సెస్, ఏరో స్పేస్, డిఫెన్స్, లాజిస్టిక్స్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లో ముందున్న హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో 19 రాష్ట్రాల్లో, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో కలిపి 21 ఐఐఎంలు ఉన్నాయని, తెలంగాణ రాష్ట్రంలోనూ ఐఐఎం ఏర్పాటు చేయాలని కోరారు. ఐఐఎం ఏర్పాటుకు అవసరమైన 200 ఎకరాల భూమిని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రాంగణంలో గుర్తించామన్నారు. ఐఐఎం తరగతులు వెంటనే ప్రారంభించేందుకు ట్రాన్సిట్ క్యాంపస్ సిద్ధంగా ఉందన్నారు. ఐఐఎం ఏర్పాటుకు అవసరమైన అనుమతులు వెంటనే మంజూరు చేయడంతో పాటు అవసరమైన వసతుల కల్పనకు తాము సిద్ధంగా ఉన్నట్టు స్పష్టం చేశారు. దేశంలోని అన్ని ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు వీలుగా హైదరాబాద్‌కు ఎయిర్, రైల్, రోడ్ కనెక్టివిటీ ఉందని, అనుకూల వాతావరణం, భిన్న రంగాల ప్రముఖులను అందజేసిన చరిత్ర హైదరాబాద్‌కు ఉందని తెలిపారు.

హైదరాబాద్ లో ఐఐఎం ఏర్పాటు చేస్తే అది తెలంగాణ రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన పిల్లల అవకాశాలను మెరుగుపర్చుతుందన్నారు. అలాగే తెలంగాణలో పెరిగిన జిల్లాల సంఖ్యకు అనుగుణంగా నూతనంగా 9 కేంద్రీయ విద్యాలయాలు, 16 జవహర్ నవోదయ విద్యాలయాలను మంజూరు చేయాలని కోరారు. పెరుగుతున్న పట్టణీకరణ, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కేంద్రీయ విద్యాలయాలు, జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటు అవసరాన్ని వివరించారు. కొమురం భీం ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, కామారెడ్డి, జోగులాంబ గద్వాల, నారాయణపేట, నాగర్‌కర్నూల్, సూర్యాపేట, వికారాబాద్, నిర్మల్ జిల్లాల్లో కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటు చేయాలని రిక్వెస్ట్ చేశారు. దీంతో పాటు హనుమకొండ, జనగాం, జయశంకర్ భూపాలపల్లి, జోగులాంబ గద్వాల, మహబూబాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, మెదక్, ములుగు, నారాయణపేట, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, వనపర్తి, యాదాద్రి భువనగిరి, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలో జవహర్ నవోదయ విద్యాలయాలు వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విద్యాలయాల ఏర్పాటుకు అవసరమైన స్థలం, ఇతర వసతులు కల్పించడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు.

## పంచాయతీల నిధులు ఎవరి బిచ్చం కాదు



హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: రాష్ట్రంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలది అధికార మదం తలకెక్కిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారక రామారావు (కేటీఆర్) విమర్శించారు. పంచాయతీలకు ఇచ్చే నిధులు, ఇందిరమ్మ ఇండ్లు అధికార పార్టీ నాయకుల అబ్బ సొత్తు కాదని చెప్పారు. సర్పంచులకు ఇచ్చే నిధులు రాజ్యాం గబద్ధమైనవనీ, ఎమ్మెల్యేల దయాదాక్షిణ్యాలు కాదని స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఖానాపూర్, షాద్‌నగర్ నియోజక వర్గాల్లోని బీఆర్ఎస్ మద్దతుతో నూతనంగా గెలిచిన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులను కేటీఆర్ సన్మానం చేశారు. వారికి శుభాకాంక్షలు ప్రకటించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు వచ్చే నిధులు ఎవరి బిక్ష కాదన్నారు. కాంగ్రెస్ నేతలు, అధికార పార్టీ ప్రజాప్రతినిధులు వారి ఇండ్లు, భూములమ్మి పంచాయతీలకు నిధులివ్వడం లేదని చెప్పారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేల బెదిరింపులకు భయపడొద్దని అన్నారు. ప్రజల పైసలతో కట్టే ప్రజల సొమ్ముకు ధర్మకర్తలు మాత్రమేననేది గుర్తుంచుకోవాలని సూచించారు. ఇండ్లకు అర్హులను ఎంపిక చేసే పూర్తి అధికారం గ్రామసభలకు, సర్పంచులకే ఉంటుందని చెప్పారు. ఎవరైనా అడ్డుతగిలితే తాటతీయాలన్నారు. కేంద్ర ఫైనాన్స్ కమిషన్ నుంచి రావాల్సిన రూ.3,500 కోట్ల నిధుల కోసమే బీసీలను మోసం చేసి రిజర్వేషన్లను 17 శాతానికి తగ్గించి పంచాయతీ ఎన్నికలను నిర్వహించిందని విమర్శించారు. ఫైనాన్స్ కమిషన్ నిధుల్లో 70 శాతం నేరుగా పంచాయతీలకే వెళ్తాయన్నారు.

జిల్లాకో ప్రత్యేక లీగల్ సెల్ ఏర్పాటుతోపాటు స్థానిక ప్రజా ప్రతినిధులకు ప్రత్యేక శిక్షణా శిబిరాలను నిర్వహిస్తామని వివరించారు. కాంగ్రెస్ పాలనలో పల్లెలు సంక్షోభంలో ఉన్నాయనీ, యూరియా కోసం రైతులు ముష్టి యుద్ధాలు చేస్తున్నారని విమర్శిం చారు. రైతుల వరుసలు కనపడకుండా ఉండేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం 'యూరియా యాప్' డ్రామా మొదలెట్టిందని అన్నారు. దుకాణాల్లో దొరకని యూరియా యాప్‌లో దొరుకుతుందా?అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉండేది ఇంకో రెండేండ్లేననీ, మళ్లీ వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. రానున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో ఐకమత్యంతో కలిసి పనిచేయాలని పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈ కార్య క్రమంలో మాజీ ఎమ్మెల్యేలు అంజయ్య యాదవ్, జాజాల సురేందర్, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, ఖానాపూర్ ఇంచార్జీ జాన్సన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మడిదల మండల సర్పంచులకు హరీశ్‌రావు అభినందనలు

సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలంలో బీఆర్ఎస్ బలపరిచిన సర్పంచులను మాజీమంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అభినందించారు. మంగళవారం వారు హైదరాబాద్‌లో హరీశ్‌రావును కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ హింసా రాజకీయాలను అడ్డుకుంటామని అన్నారు. కామారెడ్డి జిల్లా సోమార్‌పేట్‌లో బీఆర్ఎస్ నేత బిట్ల రాజు ఇంటిపై కాంగ్రెస్ సర్పంచ్ ట్రాక్టర్‌తో దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు బీఆర్ఎస్ ఇంచార్జీ ఆదర్శ్‌రెడ్డి, నూతన సర్పంచులు బుద్ధుల దుర్గ, గడ్డం లావణ్య, మంజుల, కొమ్ము శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గూండాల దాడిని ఉపేక్షించం : కేటీఆర్

కాంగ్రెస్ గూండాల దాడులు, అరాచకాలను ఉపేక్షించబోమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. దాడికి ప్రతిదాడి తప్పదని అన్నారు. హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని సోమార్‌పేట్ గ్రామంలో కాంగ్రెస్ నాయకుల దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ నాయకులు బిట్ల బాలరాజు, ఆయన భార్య గంజి భారతిలను కేటీఆర్ పరామర్శించారు. వారి వైద్య ఖర్చులను బీఆర్ఎస్ పార్టీనే భరిస్తుందని భరోసా ఇచ్చారు. దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసులను నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని కోరారు. చర్యలు తీసుకోకుంటే అవసరమైతే డీజీపీ, ఎస్పీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు జాజాల సురేందర్, గణేష్ బిగాలా, నాయకులు రాజారాం యాదవ్, సుమిత్రానంద్ తనోబా తదితరులు పాల్గొన్నారు.

## నేడే తుది విడత పోరు

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రాష్ట్ర వ్యాప్తంగా తుది విడతలో 182 మండలాల్లోని 3,752 పంచాయతీల్లో జరగనున్న సర్పంచ్ ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్టు ఎన్నికల సంఘం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. సర్పంచ్ స్థానాలకు 12,652 మంది, వార్డు స్థానాలకు 75,725 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్, ఆ తర్వాత మధ్యాహ్నం 2గంటల నుంచి కౌంటింగ్ ఉంటుందన్నారు. 31 జిల్లాల్లో 36,483 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. 53,06,401 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో 26,01,861 మంది పురుష ఓటర్లు, 27,04,394 మంది మహిళా ఓటర్లు, 140 మంది ఇతరులు ఉన్నారని వివరించారు. ప్రతీ పోలింగ్ స్టేషన్ వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

ఎన్నికల నిర్వహణకు 4,502 మంది రిటర్నింగ్ అధికారులను, 77,618 మంది ఇతర సిబ్బందిని నియమించినట్టు వివరించారు. మూడు విడతలకు కలిపి మొత్తం 2,489 మైక్రో అబ్జర్వర్లను నియమించినట్టు ఎన్నికల సంఘం తెలిపింది. బుధవారం సాయంత్రం ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహిస్తామనీ, వీలు కాకుంటే గురువారం పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికే అబ్జర్వర్లు, మైక్రో అబ్జర్వర్ల నియామకం జరిగిందని తెలిపారు. ఓటు వేసే వారు తమ ఎలక్షన్ కార్డు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ తదితర 18 రకాల ఐడీ కార్డులను అనుమతించినట్టు ఎన్నికల సంఘం పేర్కొంది. రాష్ట్ర వ్యాప్తంగా చివరి విడతలో 3,547 పోలింగ్ స్టేషన్లలో వెబ్




కాస్టింగ్ నిర్వహిస్తున్నారు. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలకు వెబ్ కాస్టింగ్ లాగిన్ పాస్వర్డ్ ఎన్నికల సంఘం ఇచ్చింది. పోలింగ్, ఇబ్బందులు, ఇతర శాంతి భద్రతల సమస్య తలెత్తినప్పుడు తక్షణమే స్పందిచి తగు చర్యలు తీసుకుంటారు. నెట్ సౌకర్యం లేని మారుమూల ప్రాంతాల్లో లోకల్ వీడియో రికార్డింగ్ ఏర్పాటు చేశారు.

పంచాయతీ ఎన్నికల కోడ్ అమలైనప్పటినుంచి ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా రూ.9,11,34,563 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎన్నికల సంఘం తెలిపింది. రూ.2,28,32,539 విలువైన మత్తు పదార్థాలు, రూ.3,81,63,154 విలువైన మద్యం సీజ్ చేశామని పేర్కొంది. 12,20,500 విలువ చేసే బంగారు ఆభరణాలు, రూ.78,33,840 విలువ చేసే ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు. ఇప్పటి వరకు 36,165 మందిని బైండోవర్ చేసినట్టు పేర్కొన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు భద్రత ఏర్పాటు చేసినట్టు ఎన్నికల సంఘం వివరించింది. గ్రామాల అభివృద్ధి కోసం ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటర్లందరూ పోలింగ్‌లో స్వచ్ఛందంగా పాల్గొనాలని ఎన్నికల సంఘం పిలుపునిచ్చింది. అలాగే ఫిర్యాదుల కోసం 92400212456 టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేశారు.

## రామగుండంలో ఎరువుల ఉత్పత్తికి ఆటంకం కలుగొద్దు

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రామగుండంలోని ఆర్ఎఫ్‌సీఎల్ కంపెనీలో ఎరువుల ఉత్పత్తిలో ఆటంకాలు రాకుండా చూడాలనీ, ఉత్పత్తిలో ఆటంకాలొస్తే ప్రత్యామ్నాయ ప్రణాళికతో ముందుకెళ్లేలా సిద్ధంగా ఉండాలని అధికారులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు ఆదేశించారు. ఆర్ఎఫ్‌సీఎల్‌లో ఉత్పత్తి అయ్యే యూరియాలో ఎక్కువ భాగంగా తెలంగాణకు కేటాయించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేస్తామన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆర్ఎఫ్‌సీఎల్ అధికారులతో మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ.. గత ఖరీఫ్ సీజన్‌లో రామగుండంలో ఎరువుల ఉత్పత్తి నిలిచిపోవడం వల్ల తెలంగాణ రైతులకు యూరియా సరఫరాలో తీవ్ర ఇబ్బందులు ఎదురైన విషయాన్ని ఎత్తిచూపారు. కేంద్ర ఎరువుల రసాయనాల శాఖ నుంచి 2,05,315 మెట్రిక్ టన్నుల కేటాయింపులకు గానూ కేవలం 1,10,720 మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా కావడం వల్ల లోటు ఏర్పడిందని తెలిపారు. ఈ లోటును భర్తీ



చేయాలని కేంద్రాన్ని పలుమార్లు కోరినప్పటికీ సమయానికి స్పందన లేకపోవడం వల్ల రైతులు నష్టపోయారని అన్నారు.

రామగుండంలో నెలకు సుమారు లక్ష టన్నుల యూరియా ఉత్పత్తి అవుతున్నప్పటికీ తెలంగాణకు కేవలం 40-50 శాతం మాత్రమే కేటాయింపులు జరుగుతున్నాయని చెప్పారు. ఇక్కడ ఉత్పత్తి అయ్యే యూరియాలో కనీసం 70 శాతం అయినా తెలంగాణకే కేటాయిస్తే రవాణా ఖర్చులు తగ్గి, రైతులకు వేగంగా ఎరువులు అందించవచ్చని సూచించారు. పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ..రబీ సీజన్‌కు సంబం ధించి ఆర్ఎఫ్‌సీఎల్ తీసుకుంటున్న చర్యలు, ఉత్పత్తిలో ఎలాంటి ఆటంకాలు రాకుండా చేపడుతున్న ఏర్పాట్లపై ఆరా తీశారు. రామగుండంలో తయారయ్యే యూరియాలో ఎక్కువ శాతం తెలంగాణకే కేటాంచేలా కేంద్రానికి లేఖ రాయాలని పరిశ్రమల శాఖ ఎమ్‌డీని ఆదేశిం చారు. కంపెనీ అధికారులు మాట్లాడుతూ.. అక్టోబర్, నవంబర్ నెలల్లో కేటాయింపుల మేరకు యూరియాను సరఫరా చేశామనీ, డిసెంబర్ నెలలో కూడా 50,450 మెట్రిక్ టన్నుల సరఫరా చేయనున్నామని తెలిపారు. ఇదే సమావేశంలో ఖమ్మం జిల్లా బుగ్గపాడు ఫుడ్ పార్క్‌లో నెలకొల్పనున్న పరిశ్రమల పురోగతిపై కూడా సమీక్ష జరిపారు. జనవరిలో శంకుస్థాపనలు జరిగేలా అనుమతులను వేగంగా మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు.

## ఐదో రోజు కొనసాగిన ప్రభాకర్‌రావు విచారణ

హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడైన ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావును మంగళవారం ఐదో రోజు సిట్ అధికారులు విచారణ జరిపారు. షరామామూలుగానే కొన్ని ప్రశ్నలకు సమాధానమిచ్చి, మరికొన్ని కీలకమైన ప్రశ్నలకు నేరుగా సమాధానం ఇవ్వకుండా మౌనం వహించినట్టు తెలిసింది. అయితే ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి ప్రభాకర్ రావు, అతని అనుచర అధికారులు ఉపయోగించిన సాంకేతిక పరిజ్ఞానం, వాటిని ధ్వంసం చేయడానికి గల కారణాలపైన సిట్ అధికారులు సీరియస్ గా ఆరా తీసినట్టు తెలిసింది. ముఖ్యంగా ఫోన్ ట్యాపింగ్ చేయడానికి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంలోని పొలిటికల్ బాసులలో ఎవరు ఆదేశాలిచ్చారనే విషయమై ప్రభాకర్‌రావును సిట్ అధికారులు తరచి తరచి అడగగా, మా సీనియర్లు చెప్పినట్టు చేశానని అసహనంతో సమాధానాలిచ్చినట్టు తెలిసింది.



# ఎన్నికల నేపథ్యంలో కఠిన ఆంక్షలు

## సెక్షన్ 163 అమలు - ప్రశాంత ఎన్నికలే లక్ష్యం: జిల్లా కలెక్టర్ రాజర్షి షా

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : గ్రామ పంచాయతీలకు నిర్వహించనున్న రెండవ సాధారణ ఎన్నికలు – 2025ను శాంతియుతంగా, స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం కఠిన చర్యలు చేపట్టింది. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా భారతీయ నాగరిక్ సురక్ష సంహిత – 2023లోని సెక్షన్ 163 ను అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ మేరకు ఆదిలాబాద్ జిల్లాలో గ్రామ పంచాయతీలకు మూడవ దశ పోలింగ్‌ను డిసెంబర్ 17న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోలింగ్ ముగిసిన అనంతరం అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమై, పూర్తయిన వెంటనే ఫలితాలు ప్రకటిస్తామని చెప్పారు.

**పోలింగ్, కౌంటింగ్ వరకూ ఆంక్షలు**

ఎన్నికల ప్రక్రియ మొత్తం ప్రశాంతంగా సాగేందుకు డిసెంబర్ 16 సాయంత్రం 5 గంటల నుంచి డిసెంబర్ 18 ఉదయం 10 గంటల వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయని కలెక్టర్ వివరించారు.

**సమావేశాలు, ప్రచారాలపై నిషేధం**

ఎన్నికల సమయంలో చట్టవిరుద్ధ సమావేశాలు, బహిరంగ సభలు, ఊరేగింపులు నిర్వహించడం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. సినిమా, టెలివిజన్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మాధ్యమాల ద్వారా ఎన్నికల ప్రచారం చేయరాదని, ప్రజలను ఆకర్షించే ఉద్దేశంతో సంగీత కార్యక్రమాలు, వినోద కార్యక్రమాలు, నాటక ప్రదర్శనల ద్వారా ప్రచారం నిషిద్ధమని తెలిపారు.

**మద్యం, వాహనాలపై నియంత్రణ**

ఎన్నికల దృష్ట్యా మద్యం విక్రయం, రవాణా, వినియోగంపై ఎక్సైజ్ చట్టం ప్రకారం ఆంక్షలు అమలులో ఉంటాయని తెలిపారు. అలాగే ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వాహనాలు ఏర్పాటు చేయడం నేరమని స్పష్టం చేశారు.



ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**పోలింగ్ కేంద్రాల వద్ద నిషేధాలు**

పోలింగ్ కేంద్రాలు, పరిసర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం, మొబైల్ ఫోన్లు, కార్డ్‌లెస్ ఫోన్ల వినియోగం, ఆయుధాలతో సంచారం, అనధికార వాహనాల వినియోగం పూర్తిగా నిషేధించబడుతాయని కలెక్టర్ హెచ్చరించారు. ఏ పోలింగ్ ప్రాంతంలోనైనా ఐదుగురికి మించి గుమిగూడడంపై నిషేధం అమల్లో ఉంటుందని తెలిపారు.

గ్రామ పంచాయతీల మూడవ దశ పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రక్రియలు ప్రశాంతంగా సాగేలా ప్రజలు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, వారి ప్రతినిధులు ఎన్నికల నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ఎన్నికల సమయంలో పూర్తి సహకారం అందించి ప్రజాస్వామ్య విజయానికి తోడ్పడాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

# గోదూరు సర్పంచ్, ఉప సర్పంచ్ లను,సన్మానించిన ముదిరాజ్ సంఘం2



ఇబ్రహీంపట్నం అమృత్ తెలంగాణ డిసెంబర్ 16 జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం గోదూరు గ్రామంలోని ముదిరాజ్ సంఘం –2 సభ్యులు కొత్తగా ఎన్నికైనా సర్పంచ్ బండి రాజేష్.ఉప సర్పంచ్ ఓంకార్ లక్ష్మణ్ , 11వ వార్డు మెంబర్ తాటికొండ రాజేష్ కి చిరు సత్కారం చేయడం జరిగింది ఇట్టి సన్మాన కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం 2 సభ్యులు అందేలా అనిల్. తడిసిన ప్రవీణ్. అందేలా నర్సింగ్, అందేలా అజయ్.

అందేలా రాజు, శేఖర్. కాంగ్రెస్ నాయకులు గోపు నాగ మురళి, ముదిరాజ్ సంఘ సభ్యులు పాల్గొన్నారు

# ఆదర్శవంతమైన రక్తదానం.





అమృత్ తెలంగాణ మెట్ పల్లి డిసెంబర్ 16: హిందూ – ముస్లిం అంటే సోదర భావంతో ఉండే మన భారతదేశంలో కొంత మంది మతకల్లోలాలు సృష్టించి వేరు చెయ్యాలని చూస్తారు. అలాంటి చీడపురుగులను తరిమికొడడం మనమందరం ఒకటి అని నిరూపిద్దాం. స్వామియే శరణం అయ్యప్ప కోరుట్ల పట్టణంలోని బేబీ కేర్ చిల్డ్రన్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న జైనుద్దీన్ (12 నెలల పాపా) కు అత్యవసర చికిత్స నిమిత్తం ఓ పాజిటివ్ రక్తం అవసరం అని పేషెంట్ కుటుంబ సభ్యులు డోనర్ కోసం వెతుకుతూ సామాజిక సేవకులు మెట్ పల్లి కాంగ్రెస్ పార్టీ పట్టణ మాజీ అధ్యక్షులు మహమ్మద్ ఖుతుబొద్దిన్ పాషా,కోరుట్ల సోషల్ సర్వీస్ అమీర్ ఖాన్,రక్తదాతల అనుసంధాన కర్త ఎనుగందుల ఉదయ్ కుమార్,ని సంప్రదించగా అదే సమయంలో ఉదయ్ కుమార్ పక్కనే ఉన్న కస్తాల శ్రీహరి స్వామి తనది ఓ పాజిటివ్ రక్తం అని పాపాకు నేను రక్తం ఇస్తా అని చెప్పి బ్లడ్ బ్యాంక్ కి వెల్లి రక్తం ఇవ్వడం జరిగింది. అయ్యప్ప మలధారణలో ఉండి 12 నెలల పాపకు రక్తం అవసరం అని మాట వినగానే వెంటనే స్పందించి రక్తదానం చేసిన కస్తాల శ్రీహరి స్వామిని బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, సామాజిక సేవకులు మెట్ పల్లి కాంగ్రెస్ పార్టీ పట్టణ మాజీ అధ్యక్షులు మహమ్మద్ ఖుతుబొద్దిన్ పాషా,ఉదయ్ కుమార్,అమీర్ ఖాన్, పేషెంట్ బంధువులు, స్నేహితులు అభినందించారు.

# నూతనంగా ఎన్నుకోబడ్డ సర్పంచ్, ప్రజా ప్రతినిధుల అభినందన సభ.

## పాల్గొన్న మంత్రి లక్ష్మణ్ కుమార్,మాజీ మంత్రి జీవన్ రెడ్డి.





జగిత్యాల అమృత్ తెలంగాణ డిసెంబర్ 16: జగిత్యాల పట్టణంలో నూతనంగా ఎన్నుకోబడిన సర్పంచ్,ప్రజాప్రతినిధుల అభినందన సభ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో మంత్రి లక్ష్మణ్ కుమార్ ,మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి పాల్గొన్నారు,జీవన్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు సత్తా చాటారు.రేవంత్ రెడ్డి పాలనలో అభివృద్ధికి ప్రజలు పట్టం కట్టారు అన్నారు,కాంగ్రెస్ పార్టీ విధానాలకు రేవంత్ రెడ్డి ఆలోచన విధానానికి ఆకర్షితులై ఎంతో మంది పార్టీ లో చేరారు.జగిత్యాల లో మాత్రం ఎవ్వరు గెలిచిన పర్వాలేదు..కానీ ఒరిజినల్ కాంగ్రెస్ నాయకులు గెలువొద్దని పార్టీ లోకి మధ్యలో వచ్చిన వారు అడ్డుకున్నారు. అన్నారు,తనను కలిస్తేనే అభివృద్ధి జరుగుతుంది సర్పంచులు అంటూ బెదిరిస్తున్నారు.నక్క లాగా వచ్చి ఉడుము లాగా తయారు అయ్యిండు అభివృద్ధి మీ దగ్గర కాదు.. ప్రభుత్వం వద్ద ఉంది,నిధులు కేటాయించి, అభివృద్ధి చేసేది ప్రభుత్వం. మంత్రి లక్ష్మణ్ కుమార్ సహకారం తోజగన్నాథ్ లో 18 కోట్లతో వంతెన మంజూరు చేయించిన. ఎమ్మెల్యే గా ఓడినా రేవంత్ రెడ్డి సహకారం తో మూడు నెలల్లో 30 కోట్లు నిధులు తీసుకువచ్చిన 10 కోట్లు ఉపాధి హామీ నిధులు 10 కోట్లు స్పెషల్ డెవలప్మెంట్ నిధులు 10 కోట్లు నియోజక వర్గ నిధులు,కాంగ్రెస్ లో ఉడుముల వచ్చి తన తాబేదారులకు నిధులు కట్టబెట్టి, మా మీదనే పెత్తనం చెలాయిస్తున్నారు.కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు నిధులు వచ్చేవి మా హక్కులు కాజేసి నిధులు తన అనుచరులు బీఆర్ఎస్ నాయకులకు కేటాయిస్తున్నారు అని ఆరోపించారు.కాంగ్రెస్ నాయకులను పక్కనపెట్టి బీజేపీ నాయకులను సింగిల్ విండో పర్సన్ ఇంచార్జిలుగా నియమించడం నిజమయిన కాంగ్రెస్ కార్యకర్తల పై వివక్షకు నిదర్శనం.పదేళ్లు కాంగ్రెస్ పార్టీ జెండా పట్టుకొని కష్టపడిన వారికి మంత్రి లక్ష్మణ్ కుమార్ అండగా నిలుస్తారని భావిస్తున్న.నేను అభివృద్ధిలో ముఖ్యమంత్రి స్థాయి తో పోటీ పడిన వై ఎస్ రాజశేఖర్ రెడ్డి తో పోటీ పడి..జగిత్యాల జిల్లాలో జే ఎన్ టి యూ ఇంజనీరింగ్ కళాశాల, నాక్ కేంద్రం, వ్యవసాయ కళాశాల ఏర్పాటు చేయించిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జగిత్యాల మున్సిపాలిటీ లో 24 గంటలు తాగు నీరు అందించిన.రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా అంగడి చిట్టి రద్దు చేయించిన. నీ స్వార్థం కోసం నీ కడుపు నింపు కోవడం కోసం కాంగ్రెస్ పార్టీ లోకి వచ్చి గరిబోళ్ల పొట్ట కొట్టడం సరికాదు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పదేళ్ల జెండా మోసిన కాంగ్రెస్ నాయకులకు ఎంపీటీసీ, జెడ్పీటిసీ టిక్కెట్లు ఇవ్వండి.. పదేళ్ల జెండా మోసిన వారికే హక్కు ఉంటది పార్టీ లోకి నడుమ వచ్చినోళ్ళు అడ్డం వస్తే సహించేది లేదు అన్నారు.గ్రామ స్థాయిలో సమావేశం ఏర్పాటు చేసి, కాంగ్రెస్ పార్టీ కోసం పని చేసిన కార్యకర్తలకే టిక్కెట్లు ఇవ్వాలి అన్నారు,కార్యక్రమంలో నూతనంగా ఎన్నుకోబడిన సర్పంచ్,ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కొత్తగా గెలిచిన బి జె పి మద్దతు దారులు సర్పంచ్ లను సన్మానించిన డా రఘు.







అమృత్ తెలంగాణ మెట్ పల్లి డిసెంబర్ 16: మెట్ పల్లి, కోరుట్ల మండలాల్లో గెలిచిన సర్పంచ్ లు ఉపసర్పంచులు,వార్డు మెంబర్లు,గెలిచిన అభ్యర్థులకు మెట్ పల్లి పట్టణ పార్టీ కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ రఘు ఘనంగా సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు స్టేట్ కౌన్సిల్ మెంబర్ ఏలేటి నరేందర్ రెడ్డి,రుద్ర శ్రీనివాస్, అసెంబ్లీ కన్వీనర్ చెట్లపల్లి సుకేందర్ గౌడ్,భోగ దత్తు, హనుమాన్లు,తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ లను సన్మానించిన మాజీ మున్సిపల్ చైర్మన్ మర్రి ఉమా రాణి సహదేవ్.







అమృత్ తెలంగాణ మెట్ పల్లి డిసెంబర్ 16: ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో సర్పంచులుగా ఘన విజయం సాధించి గెలుపొందిన పద్మశాలి ముద్దు బిడ్డలు గూరుడు తిరుపతిని ద్యావనపల్లి రామకృష్ణ ను ఘనంగా సన్మానించిన మెట్ పల్లి మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ శ్రీమతి మర్రి ఉమారాణి సహాదేవ్, ఈ సందర్భంగా ఉమారాణి సహదేవ్ మాట్లాడుతూ పద్మశాలి లు రాజకీయంగా ఎదగాలని ఇంకా ఎన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని అన్నారు. ఈ కార్యక్రమం లో కోరుట్ల మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి, నగునూరి గంగాదర్, దువ్వగంగాదర్,దువ్వ సత్యనారాయణ,దువ్వ మనోజ్,బాస సురేందర్, బేతు శంకర్, మ్యాకల శ్రీధర్,కొండవత్తిని గణేష్,బండి అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని కాపాడిన నిర్మల్ పోలీస్

## విధుల్లో అప్రమత్తత చూపిన బ్లూ కోల్ట్ సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి లోకేశ్వరం మండలం రాయపూర్ కాండ్లీ గ్రామానికి చెందిన ఒక వ్యక్తి కుటుంబ సమస్యల కారణంగా ఆత్మహత్యకు ప్రయత్నిస్తున్నట్లు హవర్గ గ్రామస్తుల నుండి సమాచారం అందింది. వెంటనే స్పందించిన విధుల్లో ఉన్న బ్లూ కోల్ట్ సిబ్బంది సంఘటనా స్థలానికి హుటాహుటిన చేరుకొని, రెస్క్యూ చేసి సకాలంలో ఆ వ్యక్తిని రక్షించారు. అనంతరం పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చి, సంబంధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించి అవసరమైన సహాయ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్, బ్లూ కోల్ట్ సిబ్బంది చూపిన అప్రమత్తత, మానవత్వాన్ని అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా ఇలాగే ప్రజల భద్రత కోసం అంకితభావంతో పనిచేయాలని సూచించారు.



# పంచాయితీ ఎన్నికలకు పోలీసు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి.

**938 సిబ్బందితో రెండవ విడత ఎన్నికలకు పోలీసు బందోబస్తు.**
**మూడవ విడతలో 6 మండలాలలో గ్రామపంచాయతీ ఎన్నికలు**
**పోలింగ్ కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమలు.**
**33 క్రిటికల్ పోలింగ్ స్టేషన్ లలో స్పెషల్ పార్టీ బలగాలు, 10 షాడో పోలింగ్ స్టేషన్లో కమ్యూనికేషన్ వ్యవస్థ**
**ఇప్పటివరకు జిల్లాలో 756 వ్యక్తులు బైండోవర్**
**20 ఆయుధాల సేఫ్ డిపాజిట్**
**5 పోలీస్ స్టేషనులకు 5 గురు పర్యవేక్షణ అధికారులు.**
**మూడు విడతల బందోబస్తులో పాల్గొన్న ఫారెస్ట్, టిజిఎస్పి, ఎసిటిపిసి సిబ్బంది**
**20 మంది ఎస్ఐ స్థాయి అధికారులతో ప్రత్యేకంగా సమస్యాత్మక ప్రాంతాలలో స్టాటిక్ ఫోర్స్ ఏర్పాటు.**
**పోలింగ్ స్టేషన్స్, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, క్లస్టర్స్, రూట్ మొబైల్స్ లతో బందోబస్తు ఏర్పాటు.**
**గుడిహత్నూర్, బోథ్ పోలీస్ సిబ్బందికి సూచనలు.**
**151 గ్రామ పంచాయతీలలోని, 204 పోలింగ్ లొకేషన్లో ఎన్నికలు.**
**జిపి ఎన్నికల్లో ఇప్పటివరకు దాదాపు 20 లక్షల విలువచేసే 2550 లీటర్ల మద్యం స్వాధీనం.**
**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్**





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి : ఆదిలాబాద్ జిల్లా నందు మూడవ విడతలో 6 మండలాలలో జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికలకు జిల్లా పోలీసు వ్యవస్థ పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన ఐపిఎస్ తెలియజేశారు. గుడిహత్నూర్, బోథ్ నందు ఉన్న బందోబస్తు సిబ్బందికి జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా సూచనలు చేయడం జరిగింది. మూడవ విడతలో జిల్లా వ్యాప్తంగా భాగంగా 6 మండలాలలో ఎన్నికలు జరగనుండగా అందులో 37 క్లస్టర్లు, 25 రూట్ లతో, 151 గ్రామాల నందు 204 పోలింగ్ లొకేషన్లో ఎన్నికలు జరగనున్నాయి. అందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా 938 మంది పోలీసు సిబ్బందితో పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగింది అని తెలిపారు. ఇప్పటివరకు జిల్లా ఎస్పీ స్వయంగా 43 గ్రామాల నందు ఫ్లాగ్ మార్చ్ లు నిర్వహించి, ప్రజలను ఓటు హక్కు పై అవగాహన కల్పించి నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రలోభాలకు గురి కాకూడదని తెలిపారు. ఈరోజు నుండి పోలింగ్ స్టేషన్లో పరిధిలో 163 బిఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమలులో ఉంటుందని, ప్రజలు గుమ్మిగూడి ఉ ండకుండా, గొడవలకు అల్లర్లకు దారి తీయకుండా ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకొని ఇళ్లకు చేరుకోవాలని తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో సమస్యలు సృష్టించేటటువంటి వారిని, ఎన్నికలను గొడవలు సృష్టించే వారిని 756 మందిని బైండోవర్ చేయడం జరిగిందన్నారు. ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా 20 మంది వద్ద ఉన్న ఆయుధాలను సేఫ్ డిపాజిట్ చేయడం జరిగిందన్నారు. మూడు విడుదల బందోబస్తు నందు ఫారెస్ట్, టీజీఎస్పి, ఎసిటిపిసి సిబ్బంది పాల్గొంటున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మూడు విడతలలో 128(33 మూడవ విడత) క్రిటికల్ పోలింగ్ లొకేషన్స్ ఉండగా అందులో ప్రత్యేకంగా స్పెషల్ పార్టీ బలగాలచే బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎటువంటి సమాచార వ్యవస్థ లేనటువంటి 31 (10 మూడవ విడత) షాడో ఏరియాలలో ప్రత్యేకంగా కమ్యూనికేషన్ వ్యవస్థ ద్వారా విహెచ్ఎఫ్ సెట్లను ఏర్పాటు చేయడం జరిగింది. బందోబస్తు ప్రక్రియలో 20 స్టాటిక్ ఫోర్స్(ఎస్సై స్థాయి అధికారులు) , పోలింగ్ స్టేషన్లో, క్లస్టర్లలో, రూట్ మొబైల్స్ లో, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ ఏర్పాటుచేసి ఎన్నికల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా పటిష్టమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ బందోబస్తు నందు ముగ్గురు అదనపు ఎస్పీలు, నలుగురు డిఎస్పీలు, 21 మంది సీఐలు, 48 ఎస్సై లతో, మహిళా సిబ్బంది, హోంగార్డ్స్, రిజర్వు సిబ్బంది, సాయుధ సిబ్బంది, స్పెషల్ పార్టీ బలగాలచే బందోబస్తు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.

5 పోలీస్ స్టేషన్ల లకు అదనపు ఎస్పీ, డిఎస్పి స్థాయి అధికారులతో పర్యవేక్షణ.

పోలింగ్ కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమలులో ఉ ంటుందని 100 మీటర్ల వద్ద 200 మీటర్ల వద్ద ప్రత్యేక నియమ నిబంధనలు ఉ ంటాయని వాటిని పాటించాలని, ప్రజల అనవసరంగా గుమిగూడి ఉండరాదని తెలిపారు.

పోలింగ్ కేంద్రాలలోనికి సెల్ఫోన్లు, వాటర్ బాటిల్ లు, ఇంకు బాటిల్లు, ఆయుధాలు, పెన్నులు, అగ్నికి సంబంధించిన వాటికి అనుమతులు ఉండవని తెలిపారు.

పోలింగ్ కేంద్రాల వద్ద క్యూ లైన్ పద్ధతిని పాటించి పోలీసులకు సహకరించాలన్నారు.

పోలింగ్ రోజు ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ కేంద్రాలలోనికి అనుమతి ఇస్తారని తెలిపారు. తమ వెంట ఓటర్ ఐడి కార్డులను, గుర్తింపు కార్డులను తెచ్చుకోవాలి.

వాట్సాప్ నందు సోషల్ మీడియా నందు ఇతరులకు రెచ్చగొట్టేలా కించపరిచేలా పోస్టులు పెట్టిన వారిపై పోలీసు నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

ప్రచారాలు ముగిసిన సందర్భంలో బయట వ్యక్తులు గ్రామాలలో ఉండరాదు.

ఎలాంటి సమాచారం అయినా డయల్ 100 ద్వారా పోలీసులకు తెలియజేయాలని, గొడవలకు, అల్లర్లకు పాల్పడకూడదు .

ఎన్నికలు పూర్తయిన తర్వాత విజయోత్సవ ర్యాలీలు నిర్వహించరాదని, అధికారుల అనుమతితో నిర్ధారించిన రోజులలో అనుమతి తీసుకుని నిర్వహించుకోవాలి.

గెలిచిన అభ్యర్థులు టపాకాయలు పేల్చరాదు.

సున్నితమైన ప్రాంతాలలో ఫ్లాగ్ మార్చ్ లు నిర్వహిస్తూ ప్రజలలో పోలీసుల పట్ల ధైర్యం నమ్మకం పెంపొందించేందుకు కృషి చేయడం జరిగిందని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు పూర్తి చేయడానికి జిల్లా పోలీస్ యంత్రాంగం కఠినమైన చర్యలతో విధులను నిర్వర్తిస్తుందని తెలిపారు. ఎలాంటి సమాచారం అయినా డయల్ 100 ద్వారా పోలీసు సహాయాన్ని సంప్రదించవచ్చు అదేవిధంగా డబ్బు, మద్యం, బహుమతులు లాంటివి పంచే క్రమంలో పోలీసులకు సమాచారం అందించాలి, పోలీసులు వారిపై కఠిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఎన్నికల నియమావళి ప్రారంభమైనప్పటి నుండి ఇప్పటివరకు జిల్లాలో 1.5 కిలోల గంజాయి మరియు దాదాపు 20 లక్షల విలువ చేసే 2554 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకోవడం జరిగిందని, నగదు, మద్యం, డబ్బు బహుమతులకు ప్రయోగపడకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 70 కేసులలో 200 పై చిలుకు మందిపై కేసులు నమోదు అయినట్లు తెలిపారు. నియమాపాలని కచ్చితంగా అమలు చేయాలని సూచించారు.

# ప్రజల నడ్డి విరుస్తున్న వడ్డీ వ్యాపారి అరెస్ట్, రిమాండ్ – టూ టౌన్ సీఐ కె నాగరాజు

**అధిక వడ్డీలు వసూలు చేసే వారిపై చర్యలు తప్పవు.**
**అప్పుకు ఇల్లులు, స్థలాలు రాయించుకుంటున్న వారిపై ప్రత్యేక దృష్టి**
**నిందితుడు మహమ్మద్ తాషావర్ అహ్మద్ (55) s/o లేట్ మహమ్మద్ నసీర్ అహ్మద్, దేవరకొండ బస్తి, బంజారాహిల్స్, హైదరాబాద్.**
**వివరాలలో**
**అప్పు పేరుతో బాధితురాలు ఇల్లుని రిజిస్ట్రేషన్ చేయించుకున్న నిందితుడు.**




అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి అధిక వడ్డీలకు అప్పులు ఇస్తూ ఇళ్లను స్థలాలను రాయించుకుంటున్న వారిపై జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు ప్రత్యేక దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకుంటున్నామని టూ టౌన్ సీఐ కే నాగరాజు తెలియజేశారు. అందులో భాగంగానే ఆదిలాబాద్ పట్టణానికి చెందిన మహిళ యాస్మిన్ ఫిర్దౌస్ (30) %ష/శీ% మహమ్మద్ రఫీ సుందరయ్య నగర్ కు చెందిన బాధితురాలు తన మరిది కూతురు వివాహానికై గత సంవత్సరం మే నెలలో 15 లక్షలు ఆరు శాతం వడ్డీతో నిందితుడైన మహమ్మద్ అహ్మద్ వద్ద అప్పుగా తీసుకున్నది. దీనికి నిందితుడు బదులుగా తన ఇంటిని రాస్తే అప్పు ఇస్తానని చెప్పి, ఇళ్లను తన పేరుపై రాయించుకొని 15 లక్షలు వడ్డీకి ఇచ్చాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయి, విచారణ చేపట్టగా వడ్డీ పేరుతో ప్రజల నడ్డి విరుస్తున్న వడ్డీ వ్యాపారి అని తేలడంతో అతనిని ఈరోజు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించడం జరిగిందని టూటౌన్ సిఐ నాగరాజు తెలియజేశారు. ప్రజలు అధిక వడ్డీలకు మోసపోకుండా ఉండాలని సూచించారు. ఎలాంటి అవసరమున్న బ్యాంకులను సంప్రదించాలని తెలిపారు. వడ్డీ వ్యాపారస్తులకు ఇల్లులు స్థలాలు రాసుకున్నట్లయితే పోలీసు యంత్రం గాని సహాయం కై సంప్రదించాలని తెలిపారు.

# మూడోదశ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు: కలెక్టర్



వనపర్తి :అమృత్ తెలంగాణ: ఎన్నికలు పారదర్శకంగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని, ప్రజలు నిర్భయంగా తమకు నచ్చిన అభ్యర్థికి ఓట్లు వేసుకోవచ్చని జిల్లా ఎన్నికల అథారిటీ, కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు బ్యాలెట్ బాక్సులతో తరలి వెళ్లిన పోలింగ్ సిబ్బంది డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను జిల్లా ఎన్నికల అథారిటీ, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మంగళవారం సందర్శించారు. వనపర్తి జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలు మూడవ విడత ఎన్నికలు నిర్వహించనున్న 5 మండలాల్లో ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణములో సజావుగా నిర్వహిస్తామన్నారు.

ప్రజలు తమ అమూల్యమైన ఓటును తమకు నచ్చిన అభ్యర్థికి వేసుకోవాలని సూచించారు. పెబ్బేరు, చిన్నంబావి, వీపనగండ్ల, పానగల్ మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలల్లో ఎలాంంటి పొరపాట్లకు తావివ్వకూడదని డిస్ట్రిబ్యూషన్ అధికారులను ఆదేశించారు. మూడవ విడతలో పెబ్బేరు మండలంలో 17 సర్పంచి, 141 వార్డు మెంబర్లు, చిన్నంబావి మండలంలో 16 సర్పంచి, 139 వార్డు మెంబర్లు, వీపనగండ్ల మండలంలో 14 సర్పంచి, 124 వార్డు మెంబర్లు, శ్రీరంగాపూర్ మండలంలో 8 సర్పంచి, 77 వార్డు మెంబర్లు , పానగల్ మండలంలో 26 సర్పంచి, 221 వార్డు మెంబర్లు వెరసి 81 గ్రామ సర్పంచి, 702 వార్డు మెంబర్లకు బుధవారం పోలింగ్ నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు జరిగే పోలింగ్ లో ఓటర్లు అందరూ తమ ఓటు హక్కును నిర్భయంగా తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేసుకోవాలని సూచించారు.

ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా గట్టి పోలీస్ భద్రత కల్పించడం జరిగిందని, ఫ్లయింగ్ స్క్వాడ్ నిరంతర నిఘా పెడుతూ ఎక్కడైనా ఎన్నికల నిబంధనలు ఉ ల్లంఘించినా లేదా ఓటర్లను ప్రలోభాలకు గురిచేసిన లేదా భయబ్రాంతులకు గురి చేసిన వెంటనే కఠినమైన చర్యలు తీసుకునే విధంగా ఎన్నికల అథారిటీ పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు.

తుది విడత పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు 968 ప్రిసైడింగ్ అధికారులు, 1271 ఒ .పి.ఓ లు వెరసి 2239 మంది పోలింగ్ సిబ్బంది మంగళవారం మెటీరియల్ తీసుకొని ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్ళారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు మల్లయ్య బట్టు పెబ్బేర్ మండలంలో, అదనపు

కలెక్టర్ రెవెన్యూ ఎన్ ఖీమ్యా నాయక్ వీపనగండ్ల మండలంలో, ఆర్డీఓ సుబ్రమణ్యం చిన్నంబావి మండలంలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పర్యవేక్షించారు. తహసీల్దార్లు, ఎంపీఓలు తదితరులు డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

# మూడవ విడత పంచాయతీ ఎన్నికలకు పకడ్బందీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు






అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి మూడవ విడత పంచాయతీ ఎన్నికల కొరకు 1000 మంది పోలీస్ అధికారులు , సిబ్బందితో భారీ బందోబస్తు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాల మోహరింపు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలి ఎన్నికల భద్రతపై రాజీ లేదు – పోలీస్ యంత్రాంగానికి దిశానిర్దేశం చేసిన జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్ రేపు భైంసా సబ్ డివిజన్ లో జరుగనున్న మూడవ విడత పంచాయతీ ఎన్నికలను శాంతియుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని రకాల భద్రతా చర్యలను పకడ్బందీగా చేపట్టామని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ తెలిపారు. పంచాయతీ ఎలక్షన్ బందోబస్తు సందర్భంగా జిల్లా ఎస్పీ, సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ. పోలీసు అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక దిశానిర్దేశాలు జారీ చేశారు. ప్రతి గ్రామంలో శాంతిభద్రతలు క్షుణ్ణంగా పర్యవేక్షించేలా బలగాల నియోజకవర్గాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు ఎన్నికల కేంద్రాల వద్ద క్రిటికల్, సాధారణ, అత్యంత సున్నిత ప్రాంతాలుగా గుర్తించి, అదనపు బలగాలను మోహరించినట్లు వివరించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు తావు ఇవ్వకుండా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టంచేశారు. ప్రజలు, అభ్యర్థులు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని, శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని అన్ని పోలీసు అధికారులకు, బందోబస్తు సిబ్బందికి తమ తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని, ప్రజాస్వామ్య పండుగ అయిన ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించే దిశగా కట్టుదిట్టంగా పని చేయాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ డా జి జానకి షర్మిల ఐపీఎస్ తో పాటు,భైంసా ఏ ఎస్పీ రాజేష్ మీన, ఇన్స్పెక్టర్లు, ఆర్.ఐ.లు, ఎస్ఐ లు, ఆర్ ఎస్ ఐ లు, సిబ్బంది పాల్గొన్నారు.

# దొంగ ఓట్లపై కలెక్టర్ కు సర్పంచ్ అభ్యర్థి ఫిర్యాదు



వనపర్తి :అమృత్ తెలంగాణ: వనపర్తి మండలం సవాయిగూడెం గ్రామంలో రెండవ విడత 14వ తేదీన జరిగిన గ్రామ పంచాయతీ ఎలక్షన్ లో దొంగ ఓట్లు కౌంటింగ్ విషయంలో అధికారుల లోపంపై కలెక్టర్ కు సర్పంచ్ అభ్యర్థి శ్రీలత, గ్రామస్తులు కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట వారు మాట్లాడుతూ తాము పలుమార్లు అధికారులకు దొంగ ఓట్లు ఉన్నాయని ఫిర్యాదులు ఇచ్చామన్నారు. అయినా అధికారులు పట్టించుకోలేదని ఈసీకి కూడా ఫిర్యాదు ఇచ్చామని, దొంగ ఓటర్లను తొలగించలేదని ఇలా తొలగించకపోవడం వల్ల ఎంతో మంది తనకు చట్టబద్ధమైన ఓటు వేసిన వారు కూడా అభాసు పాలవుతున్నారని పేర్కొన్నారు.ఫిర్యాదులు ఇచ్చినా పట్టించుకోవడం లేదంటే అధికారులు సైతం తప్పు చేసేవారికి సహకరించినట్లుగా ఉ ందని మా సొంత గ్రామం వారివి అవతలివారికి ఈ ఓట్లు పడవు అనుకున్న వారిని తొలగిస్తూ వారికి కావాల్సినవార్లను సొంత గ్రామం కాకపోయినా చేర్చుతూ ఓటర్ లిస్ట్ లో పేర్లను చేర్చుతూ బిఎల్ఓ సునంద దొంగ ఓట్లు వేయించేవారికి సహకరిస్తుందని దొంగ ఓట్ల అని చెప్పినా, అధికారులు ఓటర్ లిస్ట్ లో పేరు ఉంది కనుక వేయిస్తున్నామని అధికారులు చెప్పారని తెలిపారు. కౌంటింగ్ సమయంలో తమకు అనుమానం ఉందనిఅధికారులను రీకౌంటింగ్ చేయాలని అడుగుతే అధికారులు సహకరించడం లేదన్నారు. పైగా మమ్మల్ని బెదిరింపులకు గురి చేస్తున్నారని, రీకౌంటింగ్ దొంగ ఓట్లను మైనస్ చేయుటంలో కలెక్టర్ కు ఫిర్యాదు చేశామన్నారు. తనను నమ్మి ఓట్లు వేసిన వారికి న్యాయం జరిగే వరకూ హైకోర్టుకు వెళ్లైనా సరే న్యాయం జరిగే వరకూ పోరాడుతానని చెప్పారు.

# మూడో విడత పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధం



కుభీర్ : అమృత్ తెలంగాణ: మండలం లోని 42గ్రామ పంచాయతీలో మూడో విడత స్థానిక సర్పంచ్ వార్డ్ సభ్యుల ఎన్నికలకు సర్వం సిద్ధమైనట్లు ఎంపీడీఓ సాగర్ రెడ్డి అన్నారు. ఈ సందర్బంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. మండలంలో 42 గ్రామపంచాయతీలు ఉండగా అందులో ఇందులో ముడు పల్సి తండా, జంగావ్, బ్రమేశ్వర్ గ్రామ పంచాయతి లు ఏకగ్రీవం కాగా మిగితా 39గ్రామ పంచాయతిలో సర్పంచ్ 231 వార్డ్ సభ్యుల కు బుధువారం స్థానిక ఎన్నికలు జరగనున్నట్లు తెలిపారు. దింతో మంగళవారం మండల కేంద్రమైన కుభీర్ ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్నికల సిబ్బందికి అవసరమైన ఎన్నికల సామాగ్రి నీ అధికారులకు పంపిణి చేశారు. దింతో అధికారులకు ఎన్నికలు నిర్వహణ పక్క ప్రణాళికలతో జరపాలని అధికారులు ఎంపీడీఓ ఆదేశించారు. ఎలాంటి లోటు బాటులకు చోటు కల్పించకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నమని అన్నారు.

# పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధం: ఎంపీడీఓ



ముధోల్ : అమృత్ తెలంగాణ: మూడవ విడత పంచాయతీ పోలింగ్ కుఅన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీవో లవకుమార్ తెలిపారు. బుధవారం జరగనున్న ఈమూడవ దశ పంచాయతీ ఎన్నికలు సంబంధిత ఎన్నికల అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టి అన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు .ముధోల్ మండలంలోని 19 గ్రామ పంచాయతీల గాను మండలంలోని ఎడ్ బిడ్ తండా, విట్టోలి తండా, గ్రామపంచాయతీలరెండు సర్పంచ్ స్థానాలు అలాగే మండలంలోని53 వార్డులు ఏక గ్రీవం కాగా 17 పంచాయతీ ల సర్పంచ్ లకు 113 వార్డుల కు ఎన్నికలు జరగనున్నాయి.

మంగళవారం ముధోల్ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో పోలింగ్ ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు ,17 గ్రామ పంచాయతీలకు గాను ఐదు రూట్ల గాను ఐదుగురిని రూట్ల ఆఫీసర్ లు ఏర్పాటు చేసి ఐదు కౌంటర్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు ఈ కౌంటర్ల ద్వారా సంబంధిత జీపీలకు ఎన్నికల సామాగ్రిని ఆర్వో ,పీవో,ఓపిఓలకు అందజేశారు అలాగే ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్ ను ఏర్పాటు చేశారు. ఈ ప్రక్రియను జిల్లా సీఈవో దుర్గం శంకర్, అలాగే మండల ప్రత్యేక అధికారి రాథోడ్ సుదర్శన్ తో పాటు ఎంపీడీవోలవ కుమార్, ఎంపీవోశివకుమార్, తాసిల్దార్ శ్రీలత పర్యవేక్షించారు ఎన్నికల సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు.అయితే ఈ ఎన్నికలకు 18అర్వో లు,180 పిఓ లను 274 ఏపీఓలను లను నియమించినట్లు తెలిపారు అంతేకాకుండా ఐదుగురు రూట్ల ఆఫీసర్లను నియమించారు .హెల్ప్ డెస్క్ తోపాటు రిజర్వు కౌంటర్, అటెండెన్స్ కౌంటర్, తో పాటు తదితర ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించారు ఇంతే కాకుండా ఇద్దరు జోనల్ ఆఫీసర్లను తోపాటు ఐదుగురురూటు ఆఫీసర్లను నియమించారు ముధోల్ మండలంలోని మొత్తం 28754 ఓటర్ల కు గాను11844 పురుషులు 14,908 మహిళలు ఇతరులు ఇద్దరు ఓటర్లు ఉన్నారు

గట్టి బందోబస్తు

బుధవారం నిర్వహించే ఈ పోలింగ్కు అందరూ ప్రశాంతంగా తమ ఓటు హక్కు వినియోగించేందుకు పోలీసులు ప్రత్యేక బందోబస్తు ను ఏర్పాటు చేసినట్లు ముధోల్ సిఐ మల్లేష్ తెలిపారు ఎలాంటి అవంచనీయ సంఘటనలు జరగకుండా పగడ్బందీ భద్రత చర్యలు చేపట్టినట్లు సిఐ వెల్లడించారు ఇందులో ఇద్దరు సిఐలు పదిమంది ఎస్సైలు ఒక వంద ఐదు మంది పోలీస్ సిబ్బందిని నియమించినట్లు ఆయన వివరించారు ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సదుద్దేశంతోనే భద్రత చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

# సర్పంచ్ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ముస్తాబవుతున్న జీపీ



మునుగోడు :అమృత్ తెలంగాణ: ఈనెల 11న మొదటి విడత సర్పంచ్ ఎన్నికలలో గెలుపొందిన సర్పంచ్ వార్డు నెంబర్లు ఈనెల 20 న చేపట్టే ప్రమాణ స్వీకార మహోత్సవానికి మునుగోడు గ్రామపంచాయతీ కార్యాలయానికి మంగళవారం జీపీ కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి రంగులు వేయిస్తూ ముస్తాబు చేస్తున్నారు. పాలకవర్గం సమావేశ మందిరంలో నూతన కుర్చీల ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈనెల 20 న నూతన సర్పంచిగా ప్రమాణస్వీకారం చేయనున్న పాలకూరి రమాదేవి నరసింహ

తోపాటు 14 మంది వార్డు సభ్యులు చేపట్టే ప్రమాణ స్వీకార మహోత్సవానికి గ్రామంలోని ప్రజలందరూ అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## కార్మికుల సన్మానానికి కృతజ్ఞతలు తెలిపిన నూతన వార్డు మెంబర్




ఆలేరు : అమృత్ తెలంగాణ: ఆలేరు మండలంలోని టంగుటూరు గ్రామ సమీపంలో ఉన్న గౌతమి ఎక్స్ప్లోజింగ్ కంపెనీలో కార్మికుడిగా పనిచేస్తున్న కంతి బాలరాజు శారాజీపేట గ్రామంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా 7వ వార్డు మెంబర్గా ఘన విజయం సాధించారు. ఈ సందర్భంగా కంపెనీలోని తోటి కార్మికులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కంతి బాలరాజు మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి శుభాకాంక్షలు తెలిపిన తోటి కార్మికులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే వార్డు సభ్యులు, గ్రామ ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు. గ్రామ సర్పంచ్తో కలిసి ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సహకారంతో 7వ వార్డును అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

## అమృత్ తెలంగాణ సినిమా వార్తలు

# తమన్నా తళుకు బెళుకులు.. చూస్తూ ఉండిపోవాల్సిందే..!



మిల్కీ బ్యూటీ తమన్నా బాలీవుడ్ మూవీ చంద్ స రోషన్ చెహ్రా సినిమాతో తెరంగేట్రం చేయగా శ్రీ సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది. ఆ తర్వాత రెండేళ్లు తమిళ సినిమాల్లో నటిస్తూ వచ్చిన అమ్మడు మళ్లీ హ్యాపీడేస్ తో తెలుగులో నటించింది. హ్యాపీడేస్ సూపర్ హిట్ అవడంతో తమన్నాకి టాలీవుడ్ లో సూపర్ క్రేజ్ ఏర్పడింది. ఇక అక్కడ నుంచి ముందు యువ హీరోలతో నటించి ఆ తర్వాత స్టార్ ఛాన్సులు అందుకుంది అమ్మడు. సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చి దాదాపు 20 ఏళ్ల కావొస్తున్నా ఇప్పటికీ యువ హీరోయిన్స్ కి పోటీ ఇస్తూ వరుస సినిమాలు చేస్తుంది తమన్నా. కేవలం హీరోయిన్ గానే కాదు అమ్మడు స్పెషల్ సాంగ్స్ కి కేరాఫ్ అడ్రెస్ గా మారింది. హీరోయిన్స్ లో కొద్దోగొప్పో డ్యాన్స్ చేస్తూ అలరించే తమన్నాతో జోడీ కట్టేందుకు స్టార్స్ కూడా ఆసక్తి చూపించారు. స్టార్ హీరోలతోనే కాదు సీనియర్ స్టార్స్ తో కూడా తమన్నా జత కట్టింది. చిరంజీవి నాగార్జున వంటి స్టార్స్ తో కూడా తమన్నా నటించింది. ఇప్పటికీ ఓ పక్క సీనియర్ ఫస్ట్ బెస్ట్ ఆప్షన్ గా తమన్నా తన సత్తా చాటుతుంది. మరోపక్క యువ హీరోలతో కూడా కలిసి చేసేందుకు ఇంట్రెస్ట్ చూపిస్తుంది. తెలుగుతో పాటుగా తమిళ హిందీ పరిశ్రమల్లో కూడా తమన్నా సూపర్ క్రేజ్ తెచ్చుకుంది.

# అతని ప్రవర్తనతో చాలా భయపడ్డా!



ప్రతీ ఇండస్ట్రీలో హీరోయిన్లకు కొన్ని నియమాలుంటాయని, అవి అన్ని చోట్లా ఒకేలా ఉండవని ప్రముఖ నటి మాళవికా మోహనన్ తెలిపింది. ప్రతీ ఇండస్ట్రీలో హీరోయిన్లకు కొన్ని నియమాలుంటాయని, అవి అన్ని చోట్లా ఒకేలా ఉండవని ప్రముఖ నటి మాళవికా మోహనన్ తెలిపింది. సౌత్ లో కనిపించాలంటే హీరోయిన్ మరీ సన్నగా ఉండకూడదని, అలా ఉంటే తప్పని శరీరాకృతి విషయంలో తాను ఎన్నో ఛాలెంజెస్ ఎదుర్కొన్నట్టు మాళవికా తెలిపింది. ఒకప్పుడు తనపై ఎన్నో విమర్శలు వచ్చాయని మాళవిక వెల్లడించింది. గతంలో తనపై వచ్చిన విమర్శలు తనను ఎంతగానో బాధించాయని చెప్తూ తనకు ఎదురైన ఓ చేదు అనుభవాన్ని మాళవిక బయటపెట్టింది. ఒకరోజు రాత్రి తాను ఫ్రెండ్స్ తో కలిసి ముంబైలోని లోకల్ ట్రైన్ లో జర్నీ చేశానని, ఆ జర్నీ టైమ్ లో తనని ఒకతని ప్రవర్తన చాలా భయపెట్టిందని మాళవికా మోహనన్ తెలిపింది. మరో సినిమాను ఓకే చేసిన ప్రభాస్ జర్నీ చేస్తున్న టైమ్ లో ఆ కంపార్ట్మెంట్లో తను, తన స్నేహితులు తప్ప ఎవరూ లేరని, ఆ టైమ్ లో ఒకతను తమ కంపార్ట్మెంట్ లోకి వచ్చేందుకు ట్రై చేశాడని, అక్కడున్న గ్లాస్ డోర్ నుంచి తొంగిచూస్తూ ముద్దిస్తావా అని సైగలు చేశాడని, అతని ప్రవర్తన తనను, తన ఫ్రెండ్స్ ను భయపడేలా చేసిందని, ఆ టైమ్ లో అసలేం చేయాలో అర్థం కాలేదని మాళవిక వెల్లడించింది. అలా భయపడుతూ ఉండగా ట్రైన్ మరో స్టేషన్ కు వచ్చిందని, అక్కడ తమ కంపార్ట్మెంట్ లోకి మరికొంత మంది వచ్చాక తమ భయం మొత్తం పోయిందని మాళవిక తెలిపింది. ఇక హీరోయిన్ లుక్స్ విషయంలో కూడా మాళవిక మాట్లాడింది. కొంచెం బరువు పెరిగి నార్త్ లో సినిమా చేయాలనుకుంటే అక్కడ ఛాన్సులు రావని, నార్త్ సినిమా కోసం కొంచెం సన్నబడి తిరిగి సౌత్ కు వస్తే ఇక్కడ బొద్దుగా ఉంటేనే బావుంటావంటారని మాళవిక తనకు ఎదురైన అనుభవాలను చెప్పుకొచ్చింది. దీంతో ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తల్లో కన్ఫ్యూజ్ అయ్యానని, తర్వాత మెల్లిగా సిట్యుయేషన్స్ అర్థమయ్యాయని ఏదేమైనా ఫిట్గా, హెల్తీగా ఉండాలని డిసైడ్ అయినట్టు అమ్మడు తెలిపింది. తన కెరీర్ స్టార్టింగ్ లో సన్నగా ఉన్నానని ఎంతోమంది ట్రోల్ చేశారని, ఆ తర్వాత కొంచెం లావు అయ్యేసరిగా అప్పుడు కూడా తనను విమర్శించారని చెప్పిన మాళవిక దక్షిణాది హీరోయిన్లు ఎక్కువగా బొడ్డు మీదనే ఫోకస్ చేస్తారని, సోషల్ మీడియాలో కూడా బొడ్డు కనిపించేలా దిగిన ఫోటోలనే షేర్ చేస్తారని సంచలన వ్యాఖ్యలు చేసింది మాళవిక.

# హైబ్రిడ్ పిల్లతో అందుకే అందరికీ ఇబ్బంది!

సాయి పల్లవిని సినిమాకు ఒప్పించాలంటే ఎంత కష్టమవుతుంది? అన్నది ఓ సందర్భంలో చందు మొండేటి ఎంతో ఓపెన్ గా చెప్పిన సంగతి తెలిసిందే. సాయి పల్లవిని సినిమాకు ఒప్పించాలంటే ఎంత కష్టమవుతుంది? అన్నది ఓ సందర్భంలో చందు మొండేటి ఎంతో ఓపెన్ గా చెప్పిన సంగతి తెలిసిందే. ఆమెతో కలిగిన అనుభవాన్ని చందు రివీల్ చేసాడు. ఆ సమయంలో కథ, పాత్రల విషయంలో సాయిపల్లవి రెయిజ్ చేసే డౌట్లు మామూలుగా ఉండవు..ఆమెతో ఎవరు సినిమా తీయాలన్నా? ఒప్పించాలన్నా వాళ్లకు చుక్కలు కనిపిస్తాయన్నారు. సాయి పల్లవిని ఒప్పించడం అంటే? ఏ డైరెక్టర్కి అయినా ఓ సవాల్ గానే ఉంటుందని తన అనుభవాన్ని చెప్పే ప్రయత్నం చేసారు. తాజాగా సాయి పల్లవి కథలను ఎలా ఎంచుకుంటుందో రివీల్ చేసింది ఎలాటి పాత్రలోనైనా దాని లోతెంత అని చూస్తా. ఆ పాత్రలో బరువైన భావోద్వేగం ఉందా? లేదా? అన్నది ఎక్కువగా చూస్తా. దాని మీద నాలో నేనే విశ్లేషణ చేసుకుంటా. నటిస్తే ఎలా ఉంటుంది అన్నది మాత్రం సీరియస్ గా ఆలోచన చేస్తా. అన్నది తర్వాత సంగతి ఆ పాత్ర ద్వారా ప్రేక్షకుల్లో ఎంత వరకూ గుర్తింపు వస్తుందన్నది చూసుకుంటా. ఎందుకంటే ప్రేక్షకులకు నిజాయితీగల కథలు మాత్రమే చెప్పాలి. ఏ పాత్ర పోషించినా అందులో భావోద్వేగానికి ప్రేకేక్షకులు కనెక్ట్ అవ్వాలి. అలా కనెక్ట్ కాలేనప్పుడు ఎంత గొప్ప పాత్ర పోషించినా అది వృద్ధా ప్రయత్నమే అవుతుంది. అవార్డుల కన్నా ప్రేక్షకుల ప్రేమను గెలుచు కోవడం అన్నది గొప్ప విషయం. కానీ.. అవార్డుల గురించి ఎప్పుడు ఆలోచించను. ప్రేక్షకుల మెప్పు తర్వాత అవార్డులు వస్తే దాన్ని బోనస్ గా మాత్రమే భావిస్తాను. అలా అవార్డులకు రెండో ప్రాధాన్యత ఇస్తానని తెలిపింది. సాయిపల్లవి అందుకే తక్కువ సినిమాలు చేయగల్గింది. నటిగా తనకంటూ కొన్ని పరిమితులు విధించుకుని కొనసాగుతుంది. ప్రకటనల్లో కనిపించదు...గ్లామర్ పాత్రలకు దూరంగా ఉంటుంది. కోట్లు ఇస్తామన్నా నో ఛాన్స్ అంటూ రిజెక్ట్ చేస్తుంది

# ది పర్ఫెక్ట్ బోల్డ్ బ్యూటీ..!



శ్రీదేవి కూతురు జాన్వి కపూర్ బోల్డ్ ఇమేజ్ సంపాదించేందుకు బాగానే కష్టపడుతుంది. సినిమాల ఫలితాలు ఎలా ఉన్నా సరే రెగ్యులర్ గా తన లేటెస్ట్ ఫోటో షూట్స్ తో తన మీద ఫోక మిస్ అవకుండా చేస్తుంది. అందుకే రోజు ఒక కొత్త అవతారంలో కనిపిస్తుంది. గ్లామర్ షోలో తనకంటూ ఒక ప్రత్యేక ఉందంటూ ఆమె చేస్తున్న స్కిన్ షో చూస్తేనే అర్ధమవుతుంది. మడి కట్టుక్ కూర్చుంటే అవకాశాలు కష్టమే అందుకే గ్లామర్ గేట్లు పూర్తిగా ఎత్తేసి తన అందాలతో అలరించేస్తుంది

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309, ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com